క్లుప్తంగా

బీజేపీ మండల సంఘటన ప్రభారీల ఎంపిక

మంచిర్యాలటౌన్: జిల్లా సంఘటన, సంరచన ప్రబారి బద్దం లింగారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండల సంఘటన సంరచన ప్రభారీలను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. రమణారావ్(దండేపల్లి), బి.సతీశ్ రావ్(లక్సెట్టిపేట టౌన్), వెంకటేశ్వర్‌రావు(లక్సెట్టిపేట రూరల్), మాసు రజని(హాజీపూర్), జి.కృష్ణమూర్తి(మంచిర్యాల), సంజీవ్‌రావు(నస్పూర్), కాశెట్టి నాగేశ్వర్‌రావు(భీమారం), ఏ.పోశం(చెన్నూర్), లక్ష్మీనారాయణ(చెన్నూర్‌రూరల్), పెద్దపల్లి పురుషోత్తం(కోటపల్లి), డీవీ.దీక్షితులు(మందమర్రి రూరల్), అక్కల రమేశ్(మందమర్రిటౌన్), ఎం.తిరుపతి(క్యాతన్‌పల్లి), దుర్గం అశోక్(జైపూర్), పుల్లం తిరుపతి(బెల్లంపల్లి టౌన్), పత్తి వెంకటకృష్ణ(బెల్లంపల్లి రూరల్), శ్రీనివాస్ మద్దెర్ల(తాండూర్), రాచర్ల సంతోశ్(కాసిపేట), కోడి రమేశ్(భీమిని), కేశవరెడ్డి(కన్నెపల్లి), కొయ్యల హేమాజి(నెన్నెల), రాపర్తి వెంకటేశ్వర్లు(వేమనపల్లి)ను నియమించారు.

'ఉపాధి' పనుల పరిశీలన


ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీఆర్డీవో

మందమర్రిరూరల్: మందమర్రి మండలం చిర్రకుంటలోని ఉపాధిహామీ పనులను డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.పలు సూచనలు చేశారు. అనంతరం మార్కెట్ బస్టాండ్ ఆవరణలో మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం తహసీల్దార్ సతీష్‌కుమార్‌శర్మతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఈజీఎస్ ఏపీవో రజియాసుల్తానా, టెక్నికల్ అసిస్టెంట్ రాయమల్లు, సర్వేయర్ కృష్ణ, ఆర్ఐ గణపతి, ఈజీఎస్ ఏపీవో రజియాసుల్తానా, ఆర్డీసీ అధికారులు తదితరులు ఉన్నారు.

నేడు 'భూభారతి'పై అవగాహన

బెల్లంపల్లి: పట్టణంలోని రైతువేదికలో భూభారతి చట్టంపై రైతాంగానికి అవగాహన కల్పించేందుకు ఈ నెల 17న గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ దిలీప్‌కుమార్ తెలిపారు. జిల్లా పాలనాధికారి కుమార్‌దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతుసంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం భూభారతి-2025పై హాజీపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పక్కన గల శ్రీనివాస గార్డెన్స్‌లో మధ్యాహ్నం 2గంటలకు అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్ పాండే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.

మద్దికల్‌లో ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, రైతులు

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామంలో పోలీసులు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం నకిలీవిత్తనాలకు వ్యతిరేకంగా రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు వినియోగించడం ద్వారా భూముల్లోని సారవంతం దెబ్బతిని, భవిష్యత్‌లో ఆ భూములు నిరుపయోగంగా మారే ప్రమాదం ఉంటుందన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకోవాలని కోరారు. ఎస్సై శ్వేత, ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ

బెల్లంపల్లి: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ జయంతి పది రోజుల వేడుకల్లో భాగంగా బుధవారం బెల్లంపల్లిలో పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జయంతి వేడుకల జిల్లా కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ ఆధ్వర్యంలో సెయింట్ ఆంటోని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కమల, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, నాయకులు జీడుల రాములు, కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సాగునీటి కాలువ



భీమారం: కాజిపల్లి సమీపంలోని పెద్ద వాగు చెరువు నీటిని పంటపొలాలకు అందించేందుకు నిర్మించిన కాలువ నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి కాలువలను ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

వరికి తెగులు- రైతుకు దిగులు

జన్నారం: ఆరుగాలం కష్టపడి పండిస్తున్న వరి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. జన్నారం మండలంలోని కవ్వాల్, పొనకల్, ధర్మారం, కలమడుగు తదితర గ్రామాల్లో వరి పంట చేతికందే సమయంలో దోమపోటు బారిన పడుతున్నాయి. దీంతో పొలాలు ఎండిపోతున్నాయి.



గొల్లవాగు ప్రాజెక్ట్ ప్రధాన కట్టపై బీటలు



భీమారం: మండల కేంద్రం సమీపంలో 2009లో గొల్లవాగు ప్రాజెక్ట్ నిర్మించగా 6000 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ ప్రధాన కట్టపై బీటలువారడం పై రైతులు ఆందోళన చెందుతున్నారు. కట్ట నిర్మాణంలో లోపం వల్ల గతంలో కూడా కట్ట కింద నుంచి నీళ్లు లీకయ్యాయని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రధాన కట్టకి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యునానీలో సమస్యల తిష్ట


చెన్నూర్‌లోని ప్రభుత్వ యునానీ వైద్యశాల

- వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులు
- వేధిస్తున్న మందుల కొరత
- టెక్నీషియన్లు లేక నిరుపయోగంగా స్టీమ్ బాత్

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ యునానీ వైద్యశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తెలంగాణ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిలో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు మందులు పంపిణీ చేయాల్సి ఉండగా, రోగులను మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద మందులు వాడితే ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండకపోవడంతో రోగులు ఆయుష్ వైపు మళ్లారు. నిత్యం యునాని మందులు వాడే రోగులకు ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యులు లేకనే...
జిల్లాలో బెల్లంపల్లి, చెన్నూర్, నెన్నెలలో మూడు రెగ్యూలర్ యునానీ వైద్యశాలలు ఉన్నాయి. నెన్నెల, బెల్లంపల్లి ఆసుపత్రిలో వైద్యులు ఉండడంతో సక్రమంగా మందుల పంపిణీ జరుగుతోంది. చెన్నూర్ ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడంతో మందులు సరఫరా లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. నస్పూర్ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యురాలు చెన్నూర్ ఆసుపత్రికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నప్పటికీ, ఏనాడు ఆసుపత్రికి వచ్చిన దాఖలాలు లేవు. దీంతో రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించే వైద్యులు లేకపోవడంతో ఫార్మసిస్టే, మందులు పంపిణీ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

నిరుపయోగంగా పరికరాలు...
రోగుల ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా వైద్య సేవలందించేందుకు ఆయుష్ శాఖ చెన్నూర్ యునానీ ఆసుపత్రికి స్టీమ్ బాత్, పంచకర్మ పరికరాలను మంజూరు చేసింది. పరికరాలు ఆసుపత్రికి చేరి ఏడాది కావస్తున్నా, నేటికీ టెక్నీషియన్లను నియమించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ఆయుష్ శాఖ స్టీమ్‌బాత్, పంచకర్మ పరికరాలను పంపించినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి వైద్యులతో పాటు టెక్నీషియన్ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రోగులు కోరుతున్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలి



యునాని ఆసుపత్రిలో వైద్యులు, టెక్నీషియన్లు లేక వైద్య సేవలందడం లేదు. మందులు లేకపోవడంతో మంచిర్యాలకు వెళ్లాల్సి వస్తుంది. జిల్లా అధికారులు రోగుల ఇబ్బందులను గుర్తించి, వైద్యులతో పాటు సిబ్బందిని నియమించాలి.
– సత్యనారాయణ చెన్నూర్

వైద్యులు లేనిచోట...
వైద్యులు లేని ఆసుపత్రులకు మందులు సరఫరా చేయడం లేదు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న కొన్ని మందులను రోగులకు అందజేస్తున్నాం. వైద్యులు ఉన్న ఆసుపత్రికి మందుల సరఫరా బాగానే ఉంది. చెన్నూర్ ఆసుపత్రికి వైద్యున్ని నియమిస్తే మందుల సరఫరా బాగుంటుంది.– కిరణ్, ఫార్మసిస్టు, యునానీ వైద్యశాల, చెన్నూర్

ఈడీ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఈడీ చార్జ్‌షీట్ దాఖలు చేయటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం రామకృష్ణాపూర్, మందమర్రిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహూల్‌గాంధీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక గాంధీ కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తూ తప్పుడు కేసులు బనాయించటం సరికాదని పేర్కొన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణాపూర్‌లో పీసీసీ కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, వొడ్నాల శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య, నీలం శ్రీనివాస్‌గౌడ్, కళ్యాణ్, కనకరాజు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

ధ్వజస్తంభ ప్రతిష్టాపన


పూజల్లో పాల్గొన్న భక్తులు

కాసిపేట: మండల కేంద్రంలోని పార్వతి రాజరాజేశ్వర, భక్తాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దుద్దిళ్ల మనోహర్‌శర్మ, ముద్దు ధీరజ్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీజీఎంకు ఘన నివాళి

శ్రీరాంపూర్: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన శ్రీరాంపూర్ ఏరియా ఐఈడీ విభాగం డీజీఎం చిరంజీవికి ఏరియా అధికారులు, ఉద్యోగులు నివాళులర్పించారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం, ఇతర అధికారులు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర రెడ్డి, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, రక్షణాధికారి శ్రీధర్ రావు, పర్సనల్ డీజీఎం అరవిందరావు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జీఎం, ఇతర అధికారులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల శ్రీహర్ష డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం వేంపల్లిలోని మంచిర్యాల గార్డెన్‌లో నిర్వహించిన వీడ్కోలు వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగాయి. గత సెమిస్టర్‌లో 8 పాయింట్స్ దాటిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. వేడుకల్లో కళాశాల చైర్మన్ పల్లె భూమేశ్, డైరెక్టర్లు పోటు మనోహర్‌రెడ్డి, తనుగుల శ్రావణ్, ప్రిన్సిపల్ అనితాఠాకూర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు

మంచిర్యాలటౌన్: చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందిస్తేనే వారు సంపూర్ణ ఆరోగ్యంగా పెరుగుతారని, చిన్నారులకు సరిపడా పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, చిన్నారులను అంగన్‌వాడీకి పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు 2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఆహార పంట ప్రదర్శనలు, ప్రీస్కూల్ మోడల్, పెరుగుదల పర్యవేక్షణ, స్యామ్, మామ్ నిర్వహణ, ఆరోగ్య పరీక్షలను సూపర్‌వైజర్ వివరించారు. వెయ్యి రోజు ల సంరక్షణలో భాగంగా చిన్నారులకు రక్తహీనత, పరిశుభ్రత, అనుబంధ ఆహార పద్ధతులు, పిల్లల పెరుగుదల, గర్భిణుల సంరక్షణ పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక, వీవో కవి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా మంజుల పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చందన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయ, ఆశవర్కర్ వనిత, ఆర్పీ తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.


సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చెన్నూర్: పట్టణంలోని పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారిణి రాజేశ్వరి, చెన్నూర్ సీడీపీవో మనోరమ హాజరై గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిరు ధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారిణి రజిత, జిల్లా మహిళా సాధికారిత కేంద్ర జిల్లా సమన్వయ అధికారిణి సౌజన్య, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా అమ్మితే చర్యలు


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లి గ్రామంలో గుడుంబాకు బానిసై పలువురు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో గుడుంబా అమ్మకూడదని ఆ గ్రామస్తులు బుధవారం గుడుంబా వ్యతిరేక ఉద్యమానికి సిద్ధమయ్యారు. గ్రామ పెద్దలు, యువకులు ర్యాలీ తీశారు. అనంతరం ఎస్సై శ్యాంపటేల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై గ్రామస్తులతో సమావేశమై గుడుంబా వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. గుడుంబా విక్రయించే నాలుగు కుటుంబాల ఇంటికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించి, మర్యాదపూర్వకంగా గుడుంబా అమ్మవద్దని సూచించారు. కాదని అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు సంతాప సభ

వేమనపల్లి: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నాయిని కన్నయ్య సంతాప సభ నిర్వహించనున్నట్లు సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ కార్యదర్శి సంకె రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11గంటలకు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన మంగెనపల్లికి చెందిన నాయిని కన్నయ్య కుటుంబాన్ని పరామర్శించనున్నారు. అనంతరం మండల కేంద్రంలో సంతాప సభ నిర్వహిస్తారన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

భీమారం: జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరుతూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రాజన్న బుధవారం ఎంపీడీవో మధుసూధన్‌తో పాటు అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పనిచేస్తేనే పూట గడవని ఫీల్డ్ అసిస్టెంట్లకి, ప్రభుత్వం మాత్రం వేతనాలు చెల్లించడం లేదని వాపోయారు. నానా ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం చర్యలు తీసుకొని వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎడ్ల శ్రీనివాస్, దేగ తిరుపతి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

అటెన్షన్ ప్లీజ్..
'చెత్త' నిర్లక్ష్యం!



బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ కాంట్రాక్టర్ బస్తీ పరిధి మూసివేతకు గురైన రామా టాకీసు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయి ఉంటోంది. రోజులు గడిచినా చెత్త సేకరణ చేసి డంప్ యార్డుకు తరలించడకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు చెత్త(చిత్త) శుద్ధి లేకుండా వ్యవహరిస్తుండటంతో బస్తీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే చెత్తను సేకరించి డంప్ యార్డుకు తీసుకెళ్లే చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి : కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్
ఫోన్ నంబర్ : 98499 05887

సంక్షిప్త వార్తలు

పశువులకు టీకాలు వేయించాలి
కాసిపేట: గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి సరిత తెలిపారు. ముత్యంపల్లిలో 348పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16నుంచి మే 15వరకు గ్రామాల్లో పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సంతోష్, రవీందర్, గోపాలమిత్రలు శ్యాం, సందీప్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ
కోటపల్లి: మండలంలోని ఎసన్‌వాయి గ్రామంలో శ్రీసేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవి ఆలయ నిర్మాణానికి బుధవారం దీక్ష గురు మహారాజ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. దీక్షగురు మహారాజ్ మాట్లాడుతూ.. బంజారా ఐక్యత కోసం ఆలయ నిర్మాణాలు అవసరమని తెలిపారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. నాయక్ కారోబార్ల కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీమా నాయక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్, దూప నాయక్, లోకేశ్, ప్రేమ్‌కుమార్, కిష్టయ్య, మహేందర్, లాల్‌కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి
బెల్లంపల్లి: నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. కాల్‌టెక్స్ ఏరియాలో బుధవారం టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల వినియోగం, రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై కె.మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలు ప్రజలకు అందేలా చూడాలి
కోటపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల ప్రత్యేకాధికారి షాబోద్దీన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, రాజీవ్ యువ వికాసం, తాగునీటి సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఏవో సాయికృష్ణ, ఎంపీవో అక్తర్, కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత
నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీ సాయి అనాథ వృద్ధాశ్రమానికి ఉజ్వల పాఠశాల విద్యార్థులు ఫుడ్‌ఫెస్టివల్‌ను పురస్కరించుకొని రూ.15700 ఆర్థిక సాయాన్ని ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు.